ఘనంగా అమ్మవారి విగ్రహాల

నిమజ్జనోత్సవం

తిమ్మాజిపేట : అప్పాజిపల్లిలో దుర్గామాత విగ్రహాన్ని నిమజ్జనానికి తరలిస్తున్న గ్రామస్తులు

వెల్దండ, అక్టోబర్ 13 : మండల కేంద్రంతో పాటు కొత్ర, చెర్కూర్, పెద్దాపూర్ తదితర గ్రామాల్లో ఆదివారం దుర్గమాత నిమజ్జన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా నవరాత్రులు నిత్యపూజలు అందుకున్న అమ్మవారిని గ్రామాల్లో ఆటపాటలు, కొలాటాలు, మహిళలు బొడ్డెమ్మలతో భారీ ఊరేగింపు నిర్వహించారు. అంతకముందు మండపాల వద్ద అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సమీప చెరువులు, కుంటల్లో అమ్మవారి విగ్రహాలను నిమజ్జనం చేశారు. వెల్దండ మండలం కొత్ర గ్రామంలో అమ్మవారి లడ్డూ వేలం పాటలో జైశ్రీరాం యూత్ రూ.75వేలకు లడ్డూను దక్కించుకుంది. కార్యక్రమంలో ఆయా గ్రామాల మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, నిర్వాహకులు ఉన్నారు.

కల్వకుర్తిలో..

కల్వకుర్తి రూరల్, అక్టోబర్ 13 : కల్వకుర్తి పట్టణంలోని సీతారామాంజనేయస్వామి ఆలయంలో, పెద్దమ్మతల్లి యూత్‌తోపాటు మండంలంలోని మార్చాల, తర్నికల్, పంజుగుల, రఘుపతిపేట, సంజాపూర్ గ్రామాల తదితర గ్రామాల్లో ఆదివారం అమ్మవారి విగ్రహాలకు ఘనంగా నిమజ్జనోత్సవం నిర్వహించారు. అమ్మవారి విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి వాహనంలో అమ్మవారిని పురవీధులలో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా నవరాత్రులతోపాటు అమ్మవారికి అలంకరించిన వస్త్రాలకు, పూజా సామగ్రికి వేలం నిర్వహించారు. అనంతరం గ్రామాల్లో కోలాటాలు, భజనలు చేసుకుంటూ శోభా యాత్ర నిర్వహించి అమ్మవారికి నిమజ్జనం చేశారు.

గొరిటలో లడ్డూ @ రూ.1.22లక్షలు

తిమ్మాజిపేట, అక్టోబర్ 13 : మండలంలో దేవీశరన్నవరాత్రుల్లో భాగంగా వివిధ గ్రామాల్లో కొలువుదీరిన దుర్గామాత విగ్రహాలకు శని, ఆదివారాల్లో ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా తొమ్మిది రోజుల పాటు పూజలం దుకున్న దుర్గామాత విగ్రహాలను నిమజ్జం చేశారు. అందంగా అలంకరించిన వాహనాలలో విగ్రహాలను ఉంచి భజనలు, కోలాటాలు, బొడ్డెమ్మల మధ్య నిమజ్జనానికి తరలించారు. ఈ సందర్భంగా లడ్డూ వేలం నిర్వహించారు. గొరిట గ్రామంలో దుర్గామాత వద్ద ఉంచిన లడ్డూను గ్రామస్తుడు శ్రీధర్‌రెడ్డి రూ.1.22 లక్షలకు దక్కించుకున్నారు. చాలా గ్రామాల్లో లడ్డూను వేలం పాటల్లో భక్తులు దక్కించుకున్నారు.

నీటికుంటలో పడి బాలుడు మృతి

తాడూరు, అక్టోబర్ 13 : ప్రమాదవశాత్తు నీటికుంటలో పడి బాలుడు మృతి చెందిన ఘటన మండలకేంద్రం లో ఆదివారం చోటు చేసుకున్నది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన సాయిబాబు, పద్మ దంపతులు మొదటి సంతానం జగన్(11) ఆదివారం మధ్యాహ్నం వారికి ఉన్న గేదెలు, ఆవులను నీళ్లు తాపేందుకు గ్రామ సమీపంలో ఉన్న నీటికుంట వద్దకు వెళ్లి నీళ్లు తాపుతున్న క్రమంలో జగన్ ప్రమాదవశాత్తు కుంటలో పడిపోయాడు ఆ సమయంలోనే ఆ బాలున్ని వెంట మరో ఇద్దరు చిన్నారులు సైతం ఉన్నారు. నీళ్లల్లో పడిన జగన్‌ను చూసి చిన్నారులు వెంటనే ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారమివ్వడంతో వారు అక్కడికి చేరుకొని కుంట నీటిలో పడిన జగన్‌ను బయటకు తీశారు. వెంటనే నాగర్‌కర్నూల్ ప్రభుత్వ దవాఖానకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

విజయవంతమైన వైద్య శిబిరం

కల్వకుర్తి రూరల్, అక్టోబర్ 13 : కల్వకుర్తి పట్టణంలోని షిరిడిసాయి సత్యసాయి ప్రశాంతి సన్నిధిలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతం మైంది. ఈ వైద్య శిబిరంలో పలు రకాల వైద్య పరీక్షలను 288మందికి నిర్వహించి వారికి ఉచితంగా మందులను సూచనలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో సత్య సాయిసేవా సమితి ద్వారా నిర్వహిస్తున్న సేవలను వివరించారు త్వరలో మరిన్ని సేవలను విస్తరిస్తామన్నారు. ప్రతినెలా రెండో ఆదివారం ప్రశాంతి సన్నిధిలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తునట్లు సత్య సాయిసేవా సమితి నిర్వాహకులు తెలిపారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సత్య సాయి సేవా సమితి కన్వీనర్, నిర్వాహకులు, వైద్యులు స్వామి, కృష్ణ, చంద్రకాంత్, ప్రవళికా సాయిచరణ్, విజయ్, పూజిత, సాయిశ్రీ, విజయ్‌కుమార్, శ్రీధర్ ఉన్నారు.

పండుగ పూట తాగునీటి గోస

- మిషన్ భగీరథ నీటి సరఫరాలో అధికారుల నిర్లక్ష్యం

ట్యాంకర్ వద్ద నీళ్ల కోసం పాట్లు పడుతున్న ప్రజలు

చారకొండ, అక్టోబర్ 13 : మండలంలోని చంద్రాయన్‌పల్లిలో దసరా పండుగ పూట తాగునీరు సక్రమంగా రాకపోవడంతో ప్రజలు గోస పడుతున్నారు. గ్రామానికి వచ్చే మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ కావడంతో గత మూడు రోజులుగా తాగునీరు రాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. గ్రామ పంచాయతీలో మూడు బోర్లు ఉండగా చెడిపోయాయి. దీంతో మిషన్ భగీరథ నీరే గ్రామానికి దిక్కు కావడంతో ఆ నీళ్లు కూడా పూర్తిగా సరఫరా నిలిచిపోవడంతో మరింత ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నా ఏమాత్రం సరిపడటం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మిషన్ భగీరథ నీటి పైపులైన్ మరమ్మతులు చేపట్టాలని, అదేవిధంగా పంచాయతీ బోరు మోటర్లు బాగు చేయించి నీటి సరఫరా చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

★ I, Mohammad husamoddin (Old Names) S/o. Mohammad Ekramoddin, R/o.H.No.6-4-101, Street : Arfathpura, Mandal: KORATLA-505326, District Jagtial, Telangana, Have Changed My Name as MOHAMMAD HUSSAM UDDIN

NTK-325721

WANTED

★ B.Sc. Computer Freshers 2022, 2023, 2024 Batch Male Candidates కావలెను. జీతము 17,200+ అలవెన్సులు కలవు. కాంటాక్ట్ నెం: 9848169290.

NT-336728

ప్రకటన

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777748

లింగాలలో దసరా వేడుకలో భాగంగా ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామస్తులు

తిమ్మాజిపేటలో శమీచెట్టుకు పూజలు చేస్తున్న ప్రజలు

వెల్దండ : కొత్రలో శమీ పూజకు వెళ్తున్న గ్రామస్తులు

ఘనంగా దసరా సంబురాలు

- ముగిసిన దేవీశరన్నవరాత్రోత్సవాలు..
- భక్తులతో కిక్కిరిసిన ఆలయాలు
- శమీ వృక్షాల వద్ద ప్రత్యేక పూజలు
- ఆయా గ్రామాల్లో రావణదహన కార్యక్రమాలు

అమ్రాబాద్ : శమీ వృక్షానికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అమ్రాబాద్‌లో రావణాసుర దహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న గ్రామస్తులు

కల్వకుర్తి, అక్టోబర్ 13 : కల్వకుర్తి నియోజకవర్గంలో శనివారం దసరా ఉత్సవాలు ఘనంగా జరుపుకొన్నారు. శనివారం ఉదయాన్నే దుర్గామాతకు ప్రత్యేక పూజలు చేశారు. శమీ వృక్షానికి పూజలు చేసి జమ్మి ఆకులు పంచుకొని దసరా శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పలు గ్రామాల్లో దసరా ర్యాలీలు చేపట్టారు. కల్వకుర్తి పట్టణంలో సీతారామాంజనేయ స్వామి ఆలయం వద్ద శమీ వృక్షానికి పూజలు నిర్వహించి ర్యాలీగా బీఎస్ఎన్ఎల్ మైదానం వద్దకు చేరుకున్నారు. బీఎస్ఎన్ఎల్ మైదానంలో దసరా సంబురాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పటాకులతో ఏర్పాటు చేసిన రావణాసుర కటౌట్‌ను పేల్చారు. విద్యార్థినులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కల్వకుర్తి పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో తొమ్మిది రోజుల పాటునిర్వహిస్తున్న దేవీ శరన్నవరాత్రోత్సవాలు విజయవంతంగా ముగిశాయి. దసరా రోజున అమ్మవారిని వెండి చీరతో అలంకరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే నారాయణరెడ్డి, కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, పీఏసీసీఎస్ చైర్మన్ జనార్దన్‌రెడ్డి, దేవాలయ ట్రస్టీ చైర్మన్ రమేశ్‌బాబు, ముత్యాలు, శ్రీని వాసులు పాల్గొన్నారు.

వెల్దండలో..

వెల్దండ, అక్టోబర్ 13 : మండలకేంద్రంతో పాటువివిధ గ్రామాల్లో ప్రజలు దసరా వేడుకలు శనివారం ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో గ్రామ పెద్దలు, సర్పంచులు ఆయుధ పూజలు చేశారు. ప్రజలు ఆలయాల వద్ద పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

బిజినేపల్లిలో..

బిజినేపల్లి, అక్టోబర్ 13 : మండలంలోని ఆయా గ్రామాల్లో శనివారం దసరా పండుగను ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆలయాల్లో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం గ్రామ శివారులోని శమీ వృక్షానికి పూజలు చేసి పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

తిమ్మాజిపేటలో..

తిమ్మాజిపేట, అక్టోబర్ 13 : మండలంలో దసరా పండుగను శనివారం ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఉదయం ప్రత్యేక పూజలను నిర్వహించగా సాయంకాలం ఊరేగింపుగా శమీ వృక్షం వద్దకు వెళ్లిక ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శమీ ఆకును పెట్టుకొని ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. అదేవిధంగా గ్రామాల్లో నెలకొల్పిన దుర్గామాత విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం కొలాటాలు, భజనలు, బొడ్డెమ్మలతో ర్యాలీగా తరలించి స్థానిక చెరువులు, కాల్వల్లో నిమజ్జనం చేశారు.

లింగాలలో..

లింగాల, అక్టోబర్ 13 : మండలంలో దసరా పండగ వేడుకలను శనివారం ప్రజలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకొన్నారు. దసరా పండగ ఉత్సవాలను పురస్కరించుకొని కేతావత్ భద్రునాయక్ ఇంటి నుంచి జెండాను తీసుకొని బంజారా కాలనీలోని మేరమా భవానీ ఆలయంలో అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కోదండరామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి శమీ చెట్టుకు పూజలు చేపట్టారు.

అమ్రాబాద్‌లో..

అమ్రాబాద్, అక్టోబర్ 13 : అమ్రాబాద్, పదర ఉమ్మడి మండలాల్లో ప్రజలు విజయదశమి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించుకున్నారు. అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ తన స్వగ్రామమైన అమ్రాబాద్ మండలంలోని ఎల్మపల్లిలో అమ్మవారిని దర్శించుకొని శమీ వృక్షానికి పూజలు నిర్వహించారు. అమ్రాబాద్ మండల కేంద్రంలోని కోదండరాయాలయం నుంచి ఉత్సవ విగ్రహాలను గ్రామ పురవీధుల గుండా పల్లకీసేవ నిర్వహించి శమీ వృక్షానికి పూజలు నిర్వహించి దసరా పండుగ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. అనంతరం అమ్మవారాలయ ఆవరణలో రావణాసుర దహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

కోదేరులో..

కోదేరు, అక్టోబర్ 13 : మండంలోని ఆయా గ్రామాల్లో ప్రజలు విజయదశమి వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. ఉమామహేశ్వరస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన శమీ వృక్షం వద్ద అర్చకుడు రాఘవేంద్ర శర్మ ఆధ్వర్యంలో శమీ వృక్షానికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకటస్వామి, బీఆర్ఎస్ నాయకులు పవన్‌రెడ్డి, శేఖర్‌యాదవ్, విండో డైరెక్టర్ మహేశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ నర్సింహ, అబ్దుల్‌కరీం, రాజు, సురేశ్‌శెట్టి ఉన్నారు.

పెద్దకొత్తపల్లిలో..

పెద్దకొత్తపల్లి, అక్టోబర్ 13 : మండలంలోని అన్ని గ్రామాల్లో దసరా పండుగను పురస్కరించుకొని వేడుకలు ఘనంగా జరుపుకొన్నారు. అన్ని గ్రామాల శివార్లలో శమీ చెట్టు వద్ద పూజలు నిర్వహించారు.

చారకొండలో..

చారకొండ, అక్టోబర్ 13 : దసరా పర్వదినం పురస్కరించుకొని శనివారం మండలంలోని అన్ని గ్రామాల్లో దసరా వేడుకలు ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నిర్మలా, విజేందర్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ వెంకట్‌గౌడ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బాల్‌రాంగౌడ్, సింగిల్ విండో మాజీ చైర్మన్ గజ్జెయాదయ్య గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

బల్మూరులో..

బల్మూరు, అక్టోబర్ 13 : విజయదశమి పండుగ వేడుకలు మండలంలోని ఆయా గ్రామాల్లోని ప్రజలు శనివారం ఘనంగా జరుపుకొన్నారు. సాయంత్రం గ్రామ శివారులకు వెళ్లి శమీ చెట్టు వద్ద పూజలు చేశారు.

చారకొండలో శమీవృక్షానికి పూజలు చేస్తున్న నాయకులు

కోదేరులో శమీ వృక్షం వద్ద పూజలు చేస్తున్న గ్రామస్తులు

బల్మూరులో దసరా వేడుకలు

మినీ ట్యాంక్‌బండ్‌పై ఆకట్టుకున్న వేడుకలు

- అలరింపజేసిన బతుకమ్మ ఆటలు

నాగర్‌కర్నూల్ : సంబురాలకు హాజరైన ప్రజలు

నాగర్‌కర్నూల్, అక్టోబర్ 13 : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రజలు దసరా వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. పట్టణంలోని మినీ ట్యాంకుబండ్‌పై, సీతారామ చంద్ర స్వామి, కన్యకాపరమేశ్వరి ఆలయాలతోపాటు పలు ఆలయాల వద్ద శమీ చెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మినీ ట్యాంక్ బండ్‌పై స్థానిక ఎమ్మెల్యే రాజేశ్ దంపతులు పూజలు చేయగా, కన్యకాపరమేశ్వరి ఆలయం వద్ద ఆర్యవైశ్యులు, రామాలయం వద్ద పట్టణ ప్రజలు శమీవృక్షం వద్ద పూజల్లో పాల్గొన్నారు. మినీట్యాంక్‌బండ్ వద్ద ముస్లింలు హిందువులకు గులాబీ పూలను అందజేసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ట్యాంక్‌బండ్‌పై శమీవృక్ష పూజల అనంతరం ఎమ్మెల్యే దంపతులు ప్రజల్ని నేరుగా కలుస్తూ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం టూరిజం శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బోటును ప్రారంభించారు. అదేవిధంగా ట్యాంక్ బండ్ సమీపంలోని మూసా మసీదు వద్ద ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన స్టీట్ లైట్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. మైనార్టీ సెల్‌జిల్లా అధ్యక్షుడు హబీబ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను శాలువా, పూలమాలతో సన్మానించారు. కార్యక్రమాల్లో పట్టణ ప్రముఖులు, ఆయా పార్టీల ప్రతినిధులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఘనంగా బతుకమ్మ సంబురాలు

కందనూలు మినీ ట్యాంక్ బండ్‌పై శనివారం రాత్రి దసరా సంబురాలు అంబరాన్నంటాయి. రెండు రోజుల ముందుగానే విద్యుత్ కాంతుల వెలుతురులో ట్యాంక్‌బండ్‌ను సుందరంగా తీర్చిదిద్దారు. ట్యాంక్ బండ్‌పొడవునా ఏర్పాటు చేసిన ఫొటో ఫ్రేమ్‌ల వద్ద యువతీ యువకులు ఫొటోలకు ఫోజులు ఇచ్చి దిగడం కనిపించింది. మహిళలు, యువతులు తీసుకువచ్చిన బతుకమ్మలను ఒక్కచోటికి పేర్చి బొడ్డమ్మలు వేశారు. ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి దంపతులు మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. మధ్యరాత్రి వరకు బతుకమ్మ సంబురాలు కొనసాగాయి. అనంతరం బతుకమ్మలను కేసరి సముద్రం చెరువులో నిమజ్జనం చేశారు.

ఘనంగా గ్రామోత్సవం

అచ్చంపేటటౌన్, అక్టోబర్ 13 : అమ్మవారి గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆదివారం అచ్చంపేట పట్టణంలోని వాసవీకన్యకాపరమేశ్వరి ఆలయంలో 9 రోజులు విశిష్ట పూజలు నిర్వహించి ఆదివారం వివిధ రూపాల్లో ఉన్న అమ్మవారి ఉత్సవమూర్తులను పట్టణంలోని ప్రధాన రహదారుల గుండా ఊరేగించి వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలోని కోనేరులో అవభృత స్నానం గావించారని ఆలయ అధ్యక్షుడు చంద్ర శేఖర్ తెలిపారు. ఊరేగింపు కార్యక్రమంలో కేరళ నుంచి ప్రత్యేక బృందంచే తబలా వాయిద్యం, వివిధ వేషధారణలతో చూపరులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆలయ ప్రధాన కార్యదర్శి బాలరాజు, కోశాధికారి శ్రీనివాసులు కమిటీ సభ్యులు, భక్తులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సొంత ఊర్లో నాగ్ అశ్విన్ సందడి

ఐతోలులో శమీ చెట్టు వద్దకు వెళ్తున్న నాగ్ అశ్విన్

తాడూరు, అక్టోబర్ 13 : సినీ దర్శకుడు నాగ్ అశ్విన్ దసరా పండుగను తన సొంత గ్రామమైన ఐతోలులో కుటుంబ సభ్యులతో జరుపుకొన్నారు. శనివారం నాగఅశ్విన్ తన తండ్రి జయరాంరెడ్డి, తల్లి జయంతితో పాటుభార్య, కుమారుడితో స్వగ్రామమైన ఐతోల్ గ్రామానికి చేరుకుని పండుగ వేళ సందడి చేశారు. తన కుమారుడితో కలిసి బుల్లెట్‌పై గ్రామంలో తిరుగుతూ తన సింప్లిసిటీని ప్రదర్శించారు. అనంతరం గ్రామస్తుల తోపాటుతన చిన్నాన్న నరసింహా కుటుంబ సభ్యులతో కలిసి ఇంటి వద్ద నుంచి శమీ చెట్టు వద్దకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొత్తంగా నాగఅశ్విన్ ఎలాంటి సెక్యూరిటీ లేకుండాతనకు ప్రశాంతంగా గ్రామస్తులతో గడపడంతోపాటు గ్రామంలో ఉన్న ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ ప్రాంగణంలో కొనసాగిన సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించారు. అనంతరం రాత్రి తొమ్మిదిగంటల ప్రాంతంలో తిరిగా హైదరాబాద్ బయలుదేరారు.

అమ్మవారి దయతో కొల్లాపూర్ ప్రశాంతంగా ఉండాలి

- మాజీ ఎమ్మెల్యే బీరం హర్ష వర్ధన్ రెడ్డి

దుర్గామాతకు పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బీరం

కొల్లాపూర్, అక్టోబర్ 13: దుర్గామాత ఆశీస్సులతో కొల్లాపూర్ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి అన్నారు. శనివారం దేవీనవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా ప్రముఖ ఆలయాల్లో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రంగినేని అభిలాష్ రావుతో కలసి మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. సింగోటం లక్ష్మి నరసింహ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అలాగే కొల్లాపూర్ పట్టణంలోని రామాలయంతో పాటు, జమ్మిచెట్టు, శమీవర్క్ష కమిటీ, ఆర్యవైశ్య కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాతను దర్శించుకొని పూజలు చేశారు. శమీవృక్ష కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గా మాత ప్రాంగణంలో చిన్నారులు చేసిన కూచిపుడి నాట్యాన్ని తిలకించారు. అనంతరం కొల్లాపూర్ ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్మాత్మిక మార్గంలో ప్రశాంత జీవితం దొరుకుతోందన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఆయాల అభివర్ధి కోసం నిధులు కేటాయిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం ఆలయాలకు కేటాయించిన నిధులను వాపస్ తీసుకుందన్నారు. ప్రభుత్వ తీరు మారాలని ఈ సందర్భంగా ఆయన అన్నారు. మాజీ ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

కేఎల్ఐ డీ-82 కాల్వకు గండి


కేఎల్ఐ డీ-82 కాల్వకు పడిన గండి

చారకొండ, అక్టోబర్ 13 : మండలంలోని జూపల్లి సమీపంలో కల్వకుర్తి ఎత్తిపోతల పథకం డీ-82 ప్రధాన కాల్వకు శుక్రవారం రాత్రి గండిపడింది. ఇటీవల కేఎల్ఐ ద్వారా సాగునీరును దిగువకు విడుదల చేయడంతో సాగునీరుతో కాల్వ కళకళలాడింది. డీ-82 ప్రధాన కాలువ 15 కిలోమీటరు వద్ద గండి పడడంతో కాల్వలో నీరంతా సమీప చింత చెరువు, తూము చెరువు, కుమ్మరికుంటలు నిండి అలుగు పారుతున్నాయి. అదేవిధంగా కాల్వ అనుసరించి సాగు చేసిన వరి, మొక్కజొన్న పంటలు నీరు చేరి నీటమునిగాయి. అదే గ్రామానికి చెందిన రైతులు కడారి పెద్దయ్య, వెంకటయ్య, లింగయ్య, అలివేలు, జంగమ్మ, లక్ష్మమ్మ, లక్ష్మీదేవి, ఎల్లయ్య, శ్రీను, లక్ష్మయ్యలకు చెందిన దాదాపు 20 ఎకరాల పంట పొలాలు నీట మునిగాయి. ఈ కాల్వ పలువురు రైతులు చెరువులను నింపేందుకు గండి పెట్టి ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న నీటి పారుదల శాఖ డీఈ సమ్మయ్య, ఇంజినీర్ సప్తగిరిలు శనివారం రాత్రి పొక్లెయనర్‌తో గండికి మరమ్మతులు చేసి పూడ్చారు.